సాక్షి సూర్యాపేట

గురువారం । 12 । జనవరి । 2023



ముగిసిన అంత్యక్రియలు

దైవ దర్శనానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురి మృతదేహాలకు అంత్యక్రియలు ముగిశాయి. - 10లో



దంపతులను బలిగొన్న రాంగ్‌రూట్

మోతె మండలం మామిళ్లగూడెం శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. - 10లో

గరిష్టం/కనిష్టం 31°/15°

వాతావరణం

ఉదయం ఆకాశం పొగమంచుతో మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



సర్పంచ్‌కు కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

పెన్‌పహాడ్: తెలంగాణ రాష్ట్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రం ఆవాసం దుబ్బతండా కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్ బోడితో పాటు మరికొంత మంది నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పథకాలన్నీ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నవేనని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల్లో ఆ నిధులతోనే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశం, భూమి లేని నిరుపేదలకు మూడు ఎకరాలు ఇస్తామన్న హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గెలిచినా ఓడినా వచ్చే ఎన్నికల్లో తనది చివరి పోటీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోకల రాములు, కట్కూరి కార్తీక్‌రెడ్డి, గజ్జల వెంకట్‌రెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, కాప రవి, సలిగంటి వీరేంద్ర, రంగినేని విజయ్‌కుమార్, చెన్ను రమణారెడ్డి, తూముల సాయి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి



నడిగూడెంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేస్తున్న డీఈఓ

నడిగూడెం : అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి కె. అశోక్ అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో, బృందావనపురం, సిరిపురం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో మన ఊరు-మన బడి అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి మాట్లాడారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దాత అదే పాఠశాలలో వాచ్‌మన్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన తుమ్మ వెంకటేశ్వరరావు సహకారంతో విద్యార్థులకు స్నాక్స్ పంపిణీని ప్రారంభించారు. వెంకటేశ్వరరావును ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎండీ.సలీం షరీఫ్, ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు, భద్రారెడ్డి, సుజాత, సీఆర్పీలు గురుస్వామి, గోవర్దన్ ఉన్నారు.

పెద్దగట్టు తైబజార్ వేలం పూర్తి



వేలంలో పాల్గొన్న మున్సిపల్ అధికారులు

సూర్యాపేట : మున్సిపాలిటీ పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామశివారులోగల శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతరకు బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో తైబజార్‌కు వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ సర్కస్‌ను రూ. 27లక్షలకు లక్కపాక గోపాలకృష్ణ, ఎగ్జిబిషన్ ఐటమ్స్, సర్కస్ దుకాణాల ఏర్పాటుకు రూ. 11.06లక్షలకు నలబోతు నాగరాజు, చిరు దుకాణాల ఏర్పాటుకు రూ. 19లక్షలకు ఎంఏ వాజిద్‌మియా, మిఠాయి, చిలుకలు, బూందీ అమ్మకానికి రూ. 5లక్షలు ఎ. శ్యాంసుందర్, వరిపేలాలు, పుట్నాల విక్రయానికి రూ. 3లక్షలకు ఎ. శ్యాంసుందర్, చెరుకు గడల విక్రయం రూ. 1.62లక్షలకు ఎస్. లింగమంతులు, విద్యుత్ సరఫరా లైటింగ్ రూ. 80,630లకు ఎం. ఉత్తమ్‌కుమార్‌లు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి. రామానుజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుడారై పూజలు..



కుడారై ఉత్సవాల్లో భాగంగా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ శ్రీ ఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వివేకానందుడి బాటలో..



స్వామి వివేకానందుడి బాటలో పయనిస్తూ.. పలువురు యువజన సంఘాలు ఏర్పాటు చేసుకుని సేవా మార్గంలో యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి మేమున్నామంటూ అండగా నిలబడుతున్నారు. రాజకీయాల్లోనూ రాణిస్తూ పలువురి చేత మన్ననలు పొందుతున్నారు.

- వివరాలు 8లో▸

మర్యాదగా మాట్లాడారా.. పనితీరు ఎలా ఉంది

- కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి నేరుగా ఫిర్యాదుదారులకు ఫోన్లు
- పోలీసుల తీరుపై ఆరా
- తప్పులు చేసినట్లు తేలితే సిబ్బందిపై చర్యలు
- అవినీతి అక్రమాలకు పాల్పడే ఖాకీల్లో గుబులు



చిలుకూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి గొడవ విషయంలో నెలరోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై ఫిర్యాదుదారుడికి కంట్రోల్ కేంద్రం నుంచి ఫోన్ వచ్చింది. కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇలా జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదుదారులకు ఫోన్లు వస్తున్నాయి.

చిలుకూరు: సిబ్బంది పనితీరు మెరుగుపర్చేందుకు పోలీస్‌శాఖ పలు సంస్కరణలు తీసుకొచ్చింది. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తోంది. అయినా కొంత మంది వ్యవహరిస్తున్న తీరుతో ఆ శాఖకు చెడ్డ పేరు వస్తోందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసిన బాధితులకు హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ నుంచి నేరుగా ఫోన్ చేసి మాట్లాడుతున్నారు. మీ కేసు పురోగతి, సిబ్బంది తీరు ఎలా ఉంది.. మీతో మర్యాదగా ప్రవర్తించారా.. స్టేషన్ హౌస్ అధికారి మీ సమస్యపై స్పందించారా.. లంచం అడిగారా తదితర వివరాలు తెలుసుకుంటున్నారు. దీంతో అవినీతి, అక్రమాలకు పాల్పడేవారితో పాటు, ఫిర్యాదుదారులతో దురుసుగా ప్రవర్తించే పోలీసులకు భయం పట్టుకుంది.

వివరాలు గోప్యం. . .

జిల్లాలో ఎస్పీ పరిధిలో కోదాడ, సూర్యాపేట రెండు సబ్ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో ఆరు సర్కిల్ పోలీస్‌స్టేషన్లు తుంగతుర్తి, నాగారం, సూర్యాపేట రూరల్, మునగాల, కోదాడ రూరల్, హుజూర్‌నగర్ రూరల్ ఉన్నాయి. టౌన్‌పోలీస్‌స్టేషన్లు సూర్యాపేట -1 టౌన్, సూర్యాపేట -2 టౌన్ , కోదాడ టౌన్ ఉన్నాయి. ఈ మూడింటి పరిధిలో కోదాడ, సూర్యాపేటలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లతో పాటు 23 మండలాలకు పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ముఖ్యంగా కొంత మంది నేతల కనుసన్నల్లో పోలీసులు పని చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరి కొందరు మామూళ్లకు అలవాటు పడి కేసులను తప్పుదోవ పట్టిస్తున్న తీరు వెలుగులోకి వస్తోంది. కమాండ్ కంట్రోల్ నుంచి ఫోన్ రాగానే బాధితులు వివరాలు చెప్పాలా వద్దా అని వెనకాడుతున్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇస్తుండటంతో తమకు జరిగిన అన్యాయాన్ని బాధితులు తెలియజేస్తున్నారు.

పోలీస్ సబ్ డివిజన్లు	2
సర్కిళ్లు	6
టౌన్ పోలీస్‌స్టేషన్లు	3
పోలీస్‌స్టేషన్లు	23
ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు	2
పనిచేస్తున్న సిబ్బంది	1,035

ఫిర్యాదుదారులకు భరోసా కలుగుతుంది



పోలీస్‌స్టేషన్లు పని తీరుపై కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి ఫిర్యాదుదారులకు ఫోన్లు చేసి వివరాలు తెలుసుకుంటున్నారు. దీని వల్ల ఫిర్యాదుదారులకు భరోసా కలుగుతుంది. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ఉంటూ వాళ్లకు చట్ట పరమైన న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నాం. అందుకనుగుణంగానే సిబ్బందికి సూచనలు ఇస్తున్నాం.

నాగదుర్గాప్రసాద్, కోదాడ రూరల్ సీఐ

వర్టికల్ విధానంపై కూడా..

పోలీస్‌శాఖ కొత్తగా వర్టికల్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో 14 రకాల అంశాలు ఉన్నాయి. వీటిని పాటించడం ద్వారా సేవలు మెరుగ్గా అందుతాయని భావించింది. వీటి నిర్వహణ ఆధారంగానే పోలీస్‌స్టేషన్లకు మార్కులు, ర్యాంకులు కేటాయిస్తోంది. రిసెప్షన్‌లో పని చేసే సిబ్బంది పనితీరు, స్టేషన్ రైటర్‌లు, క్రైమ్ రైటర్‌లు, బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్, కోర్టు డ్యూటీ సిబ్బంది, టెక్నికల్ బృందం, క్రైం స్టాఫ్, ఎంసీ సిబ్బంది, సెక్షన్ బాధ్యులు, జనరల్ డ్యూటీ సిబ్బంది, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ , స్టేషన్ హౌజ్ ఆఫీసర్, అడ్మిన్ ఎస్‌ఐల పని తీరు ఆధారంగా మార్కులు ఇస్తున్నారు. వీటి నిర్వహణ ఎలా ఉందన్న వివరాలను కమాండ్ కంట్రోల్ నుంచి సేకరిస్తున్నారు. ఖాకీల పని తీరుపై నిరంతరం వివరాలు సేకరిస్తుండటంతో సిబ్బందిలో గుబులు మొదలైంది. ఫిర్యాదుదారులతో దురుసుగా ప్రవర్తించినట్లు తేలితే విచారణ చేసి చర్యలు తీసుకోనున్నారు.

రెండు రోజుల్లో ఏర్పాట్లు పూర్తికావాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి అలీ ముర్తుజా రిజ్వీ. చిత్రంలో శ్వేతామహంతి, శ్రీనివాసరావు, కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

- షెడ్యూల్ ప్రకారం 'కంటివెలుగు' నిర్వహించాలి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను రెండు రోజుల్లో పూర్తి చేసుకొని సిద్ధంగా ఉండాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మహంతి, కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకుడు డాక్టర్ జి. శ్రీనివాసరావులతో కలిసి వైద్యాధికారులతో కంటి వెలుగు కార్యక్రమం అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన 52 కంటి వెలుగు బృందాలు 100 రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో సమర్థంగా పని చేయాలన్నారు. షెడ్యూల్ ప్రకారం నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. బృందాలన్నింటికీ శిక్షణ ఇవ్వాలని సూచించారు. కంటి పరీక్షలు నాణ్యతతో చేయడం ఎంతో ముఖ్యమన్నారు. రిజిస్ట్రేషన్, కంటి స్క్రీనింగ్ తదుపరి రెండుసార్లు డాటా నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం నుంచి శుక్రవారం వరకు వారానికి 5 రోజులు నిర్వహించాలన్నారు. రోజూ కార్యక్రమం పూర్తి కాగానే యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. రోజూ 120 మంది పరీక్షలకు వచ్చేటట్లు చూడాలన్నారు. ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేసి, అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేయాలన్నారు.


సమస్య వస్తే అప్రమత్తంగా ఉండాలి

వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మహంతి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఏమైనా సమస్య తలెత్తితే ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. బఫర్ సిబ్బంది, మెటీరియల్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమస్యలు వస్తే, అరగంటలో రీప్లేస్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

సిబ్బందికి సెలవులు రద్దు

రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమ సంచాలకుడు జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం నేపథ్యంలో అధికారులు, సిబ్బందికి ఎటువంటి సెలవులు మంజూరు చేయకూడదని అధికారులకు సూచించారు. ఎంసీహెచ్, ఎన్సీడీ, ఇమ్యూనైజేషన్ తదితర సేవలు ఆగకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, టీఎస్ఎంఐడీసీ ఎం.డీ. చంద్రశేఖర్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం, డీపీఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై సంబంధిత శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి అభివృద్ధికి పూర్తి స్థాయి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామ సభల్లో ప్రాధాన్యత ఇచ్చిన అంశాలను పరిగణనలోకి తీసుకొని వాటికి అనుగుణంగా సభ తీర్మానంతో సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామ సభల్లో మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులను భాగస్వామ్యం చేయాలని,స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని కలెక్టర్ కోరారు.ఎంపీఓలు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈఓ సురేశ్, డీపీఓ యాదయ్య పాల్గొన్నారు.

కంటి వెలుగుపై మాక్ డ్రిల్ విజయవంతం

సూర్యాపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కంటి వెలుగుపై నిర్వహించిన మాక్ డ్రిల్ విజయవంతమైనట్లు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, డీఎంహెచ్‌ఓ కోటాచలం తెలిపారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన మాక్ డ్రిల్‌లో వారు మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు హర్షవర్ధన్, నిరంజన్, వెంకటరమణ, కళ్యాణ్‌చక్రవర్తి, సాహితి, చంద్రశేఖర్, శ్రీనివాసరాజు, నాజియా, అంజయ్య, భాస్కర్‌రాజు, సైదులు పాల్గొన్నారు.

జాన్‌పహాడ్ ఉర్సును విజయవంతం చేయాలి



సమావేశంలో వక్ఫ్‌బోర్డు అధికారిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

- 26నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలి
- అదనపు కలెక్టర్ మోహన్‌రావు

పాలకవీడు: జాన్‌పహాడ్ దర్గా ఉర్సును విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు కోరారు. పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గాలో ఈనెల 26, 27, 28 తేదీల్లో జరిగే ఉర్సు నిర్వహణపై బుధవారం దర్గా వద్ద గల ఎస్‌కేఎస్ ఫంక్షన్ హాల్‌లో వివిధశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడు రోజుల పాటు జరిగే ఉర్సుకు భక్తులు భారీగా తరలి వస్తారని అందువల్ల వారికి ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా వివిధశాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఉత్సవ ఏర్పాట్లకు ఎన్ని నిధులు కేటాయిస్తున్నారో వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌ను అదనపు కలెక్టర్ అడిగారు. ఉర్సుకు రూ.18లక్షలు అవసరమున్నట్లు అందుకు తగిన ప్రతిపాదనలు వక్ఫ్ బోర్డుకు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు. గతంలో ఉర్సు సందర్భంగా రూ. 15 లక్షలకు రూ. 8 లక్షలు మాత్రమే సమకూర్చడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. దీనిపై వక్ఫ్ బోర్డు సీఈఓతో మాట్లాడుతానని అదనపు కలెక్టర్ చెప్పారు. జాన్‌పహాడ్ దర్గాకు వచ్చే ఆదాయంలో నామ్స్ ప్రకారం 30 శాతం నిధులు అభివృద్ధికి ఖర్చు చేయాలని ఆయన సూచించారు. భక్తులకు అవసరమయ్యే మరుగుదొడ్లు, స్నానపు గదులు త్వరితగతిన నిర్మించాలని ఆయన ఆదేశించారు. భక్తుల కోసం స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలన్నారు. దర్గా పరిసరాల్లో పార్కింగ్ ప్రదేశాల్లో తాగునీరు, లైటింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ఎలాంటి పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ప్రైవేట్ సిబ్బందిని నియమించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. నీటి సౌకర్యం కోసం ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పాటు డెక్కన్ పరిశ్రమ యాజమాన్యాన్ని ఆయన కోరారు. పెన్నా సిమెంట్స్ యాజమాన్యం దర్గా వద్ద శూన్యపహాడ్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఉత్సవాలు జరిగే మూడు రోజులు 24 గంటల వైద్య సేవలు అందించాలని అందుకు అవసరమైన క్యాంపు ఏర్పాటు చేసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖను ఆదేశించారు. సూర్యాపేట, కోదాడ, మిర్యాలగూడ ఆర్టీసీ డిపోల నుంచి ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు కేటాయించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసుకునే షాపులకు అనుమతులు ఇచ్చి నంబర్ కేటాయించాలన్నారు. రూట్లలో పార్కింగ్‌కు అవసరమైన స్థలాలను ఏర్పాటు చేయాలని, స్థలాల వద్ద లైటింగ్ ఏర్పాటు చేసి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. దర్గా సమీపంలో ప్రమాదకర ప్రదేశాల్లో చుట్టూ రక్షణ కంచె, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర విభాగం 108 వాహనాలు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. శూన్యపహాడ్, మఠంపల్లి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. ఉత్సవాల పర్యవేక్షణ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆర్డీఓ వెంకారెడ్డిని కోరారు. ఉత్సవాల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ రామలింగారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ భూక్యా గోపాల్, సర్పంచ్ గోరీ, జెడ్పీటీసీ బుజ్జి మోతీలాల్, తహసీల్దార్ శ్రీదేవి, డీఎస్పీ వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా, మండల, డివిజన్ స్థాయి శాఖలు, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీస్, ఫైర్, విద్యుత్, ఎక్సైజ్, వైద్య శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రిలో బుధవారం నిత్యారాధనలు విశేషంగా చేపట్టారు. వేకువజామున సుప్రభాతం అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన చేశారు. శ్రీస్వామి వారికి బాలభోగం చేపట్టారు. తర్వాత సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన గావించారు. ఇక ఆలయంలో సుదర్శన నారసింహహోమం, బ్రహ్మోత్సవం, నిత్య కల్యాణం, తిరువీధి జోడు సేవలు నిర్వహించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మోతె : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఖమ్మం- సూర్యాపేట జాతీయ రహదారి- 365బీబీ మేనేజర్ దివ్య సూచించారు. బుధవారం మోతె మండలంలోని ఖమ్మం- సూర్యాపేట జాతీయ రహదారి 365 బీబీ పై సింగరేణిపల్లె టోల్ గేట్ వద్ద నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. మొబైల్ వ్యాన్, స్లోగన్స్, వాల్ పోస్టర్, నేమ్ బోర్డులు, వలంటీర్స్ ద్వారా రోడ్డు నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈనెల 17వరకు రోడ్డు భద్రతావారోత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో మోతె ఎస్‌ఐ నాగభూషణం, ఇంజనీర్ వెంకట్, తేజ, స్టెనోగ్రాఫర్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఇక ఇళ్లకు డిజిటల్ నంబర్లు

- మున్సిపాలిటీల్లో బేస్ మ్యాప్ ఆధారంగా సర్వే
- డబుల్ , బై నంబర్లుకు చెక్
- పక్కాగా తేలనున్న ఇళ్ల లెక్క
- ఆదాయం పెరిగే అవకాశం



హుజూర్‌నగర్ పట్టణ వ్యూ

హుజూర్‌నగర్: మున్సిపాలిటీల్లో ఇంటి నంబర్ల గందరగోళానికి చెక్ పడనుంది. చాంతాడంత పొడవైన బై నంబర్లకు ఇక నుంచి స్వస్తి పలకనున్నారు. డబుల్ నంబర్లు ఉండటం.. ఇంటి నంబర్లు, వీధి పేర్లు తప్పుగా జారీ చేయడం వంటి ఇబ్బందుల నుంచి విముక్తి లభించనుంది. ఇక నుంచి ఇళ్లకు డిజిటల్ నంబర్లు రానున్నాయి. వీటి కోసం త్వరలో సర్వే ప్రారంభం కానుంది. సీడీఎంఏ నిర్ణయించిన ప్రైవేట్ సంస్థల సిబ్బంది తమకు కేటాయించిన మున్సిపాలిటీలో బేస్ మ్యాప్ ఆధారంగా ఇంటింటికీ వెళ్లి డిజిటల్ సర్వే చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

మున్సిపాలిటీ	భవనాలు	ఆదాయం (రూ.కోట్లలో)
సూర్యాపేట	33,062	22
కోదాడ	16,245	5.85
హుజూర్‌నగర్	7,407	1.61
తిరుమలగిరి	6,306	1.20
నేరేడుచర్ల	4,262	1.01

ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ

సర్వే సిబ్బంది వార్డుల వారీగా ఇంటింటికీ వెళ్లి వాణిజ్య భవనమా, నివాసమా, లేక రెండు అవసరాలకు వినియోగిస్తున్నారా అనే వివరాలను సేకరిస్తారు. భవనం ఎన్ని అంతస్తులు ఉంది, కుళాయి, విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయా, వాటి నంబర్లు ఏమిటి, ఇంటికి అనుమతి ఉందా, ఉంటే నంబరు తదితర వివరాలను నమోదు చేస్తారు. భవనానికి రోడ్డు సౌకర్యం ఉందా, ఉంటే సీసీ రోడ్డా, బీటీ రోడ్డా, మురుగునీటిపారుదల సౌకర్యం ఉందా అనే వివరాలను మున్సిపల్ యాప్‌లో నమోదు చేసి క్రమపద్ధతిలో డిజిటల్ నంబర్లు కేటాయిస్తారు. డిజిటల్ నంబరు ద్వారా యాప్‌పై ఒక క్లిక్ చేస్తే యజమాని పేరు, భవనం పూర్తి సమాచారం కళ్లముందు కనబడుతుంది. ఖాళీ స్థలాలకు కూడా డిజిటల్ నంబర్లు ఇవ్వనున్నట్లు సమాచారం.

పక్కాగా ఇళ్ల లెక్క

డిజిటల్ సర్వే వల్ల భవనాలతో పాటు వాటి యజమానులు, క్రమబద్ధీకరించుకోని ఇళ్ల వివరాలు నమోదవుతాయి. దీంతో ఇళ్ల సంఖ్య పెరగడమే కా కుండా ఇంటి పన్ను ఆదాయం పెరిగే అవకాశం ఉంది. మొదట ప్రధాన మున్సిపాలిటీల్లో ప్రయోగాత్మకంగా డిజిటల్ సర్వే నిర్వహిస్తారు. డిజిటల్ నంబర్లు కేటాయించాక పట్టణాల్లోని ఇళ్లన్నీ లెక్కలోకి వస్తాయి. మున్సిపాలిటీల ఆదాయం పెరిగే అవకాశం ఉందని రెవెన్యూ సిబ్బంది అంచనా వేస్తున్నారు.

ఐదు మున్సిపాలిటీలలో ...

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల ఉన్నాయి. వీటి పరిధిలో 67,280 భవనాలు ఉండగా వీటికి పన్నుల రూపంలో రూ.31.68కోట్ల ఆదాయం లభిస్తోంది. డిజిటల్ నంబర్ల కేటాయింపు తర్వాత పన్నుల ఆదాయం 5 శాతానికి పైగా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ఆదాయం పెరిగే అవకాశం ఉంది



మున్సిపాలిటీల్లో త్వరలో డిజిటల్ నంబర్లు కేటాయించడానికి సర్వే చేయబోతున్నారు. దీంతో ఇంటింటికీ డిజిటల్ నంబర్లు రాబోతున్నాయి. సర్వే పూర్తి అయిన తర్వాత మున్సిపాలిటీకి కొంత ఆదాయం పెరిగే అవకాశం ఉంది. అంతే కాకుండా అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. - కె శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్, హుజూర్‌నగర్

ఒకే మాదిరి బై నంబర్లకు..

ఒక వీధిలో ఉన్న నంబరు మరొక వీధిలో ఉండటం, ఒకే మాదిరి బై నంబర్లతో ఇంటికి నంబర్లు కేటాయించడం, వీధి పేర్లు తారుమారు కావడం వంటి వాటితో పట్టణాల్లో పలు చోట్ల సమస్యలు తలెత్తుతున్న సంఘటనలు లేకపోలేదు. ఈ విషయంలో సదరు యజమానులు మున్సిపాలిటీలోని రెవెన్యూ సిబ్బందితో తరుచూ వాగ్వాదానికి దిగిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. డిజిటల్ నంబర్ల కేటాయింపుతో ఇలాంటి సమస్యలకు అడ్డుకట్ట పడనుంది. బేస్ మ్యాప్ ఆధారంగా కేటాయించే డిజిటల్ నంబర్లలో బై నంబర్లు ఉండవు. వీధి పేరు తెలిపే అక్షరాలతో కలిపి నంబర్లను కేటాయించనున్నారు.

వివేకానందుడి బాటలో..

- సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న యువత
- యువజన సంఘాలు ఏర్పాటు చేసుకుని సమాజ సేవ
- ఆపద సమయంలో మేమున్నామంటూ భరోసా
- రాజకీయాల్లోనూ రాణిస్తున్న యూత్

నేడు జాతీయ యువజన దినోత్సవం



'మందలో ఉండకు.. వందలో ఉండు. ప్రయత్నం చేసి ఓడిపో. కానీ, ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు' అని చెప్పిన స్వామి వివేకానందుడి సూక్తులను పలువురు ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుకు సాగుతున్నారు.
నేడు నేషనల్ యూత్ డే సందర్భంగా ప్రత్యేక కథనాలు.

ప్రజలను చైతన్యపరుస్తున్న మహేష్‌రెడ్డి



పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మహేష్‌రెడ్డి

నడిగూడెం : చిన్న నాటి నుంచి ప్రజలకు సేవ చేయాలనే తపన ఆ యువకుడిది. గ్రామంలో చాలామంది మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా ఆర్థికంగా చితికిపోవడాన్ని గమనించాడు. అలాంటి వారిని చైతన్య పర్చాలనే లక్ష్యంతో కరివిరాల గ్రామానికి చెందిన యువకుడు గార్లపాటి మహేష్‌రెడ్డి గణేష్ యువజన సంఘాన్ని స్థాపించాడు. గ్రామంలో సారాను అరికట్టాలనే ఉద్దేశంతో అనేక చైతన్య కార్యక్రమాలను చేపట్టాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ సంస్థలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. తన వేతనం నుంచి ప్రతి నెలా రెండు వేల రూపాయలతో పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నాడు. ఏటా విద్యార్థులు క్రీడాకారులకు దుస్తులు అందజేస్తూ గ్రామంలో యువకులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆయన సేవలను గుర్తిస్తూ.. ఇటీవల హైదరాబాద్‌లో మనం ఫౌండేషన్, ఆదర్శ కళానిలయం ఆధ్వర్యంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ప్రస్తుత నీటిపారుదల శాఖ చైర్మన్ వేణుగోపాలచారి చేతుల మీదుగా అవార్డు, పొందారు. ఇంకా పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ఒక సామాజిక కార్యకర్తగా ప్రశంస పత్రాలు అందుకున్నారు.

సమాజ మార్పు కోసం కృషి చేస్తున్నా

మా గ్రామంలో గతంలో సారా ఏరులై పారేది. దీంతో అనేక మంది మృత్యువాత పడ్డారు. సారాను అరికట్టాలని ఆనాడు తోటి స్నేహితులతో కలిసి యువజన సంఘం ఏర్పాటు చేశాను. గ్రామంలో సారా నివారణ, అక్షరాస్యత, పేదలకు నిత్యావసర సరుకులు, విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ తదితర కార్యక్రమాలను స్వచ్ఛందంగా చేపట్టాను.
– గార్లపాటి మహేష్‌రెడ్డి, కరివిరాల

ఎంపీపీగా ప్రజాసేవలో సుమతి



పేర్ల సుమతి, అనుముల ఎంపీపీ

హాలియా : చిన్న వయస్సులో ప్రజలకు ప్రజాసేవ చేసే అదృష్టం దక్కింది అనుముల మండలం మదారిగూడెం గ్రామానికి చెందిన సుమతికి. స్థానిక సంస్థల ఎన్నికల్లో మదారిగూడెం ఎంపీటీసీ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో అక్కడి నుంచి సుమతి పోటీ చేసి గెలుపొంది.. 25 ఏళ్లకే అనుముల ఎంపీపీ పీఠాన్ని దక్కించుకున్నారు. ఎంఏ, బీఈడీ పూర్తి చేసిన ఈమె అనుముల మండల ప్రజలకు విశేష సేవలందిస్తూ పలువురి మన్నలు పొందుతున్నారు. ఒకపక్క మండల అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూనే.. మరోపక్క ప్రభుత్వ ఉద్యోగ సాధనే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

అభినవ.. ఆపన్నహస్తం..!



ఆర్థికసాయం అందజేస్తున్న అభినవ యూత్ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి : ఆపద సమయంలో ప్రజలకు తామున్నామని భరోసానిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు అభినవ యూత్ అసోషియేషన్ సభ్యులు. పోచంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సొంతూరికి సేవ చేయాలనే లక్ష్యంతో నాలుగేళ్ల క్రితం అభినవ యూత్ అసోషియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. గ్రామాభివృద్ధిలో పాలు తమవంతుగా పాలుపంచుకొంటూ సామాజిక సేవలో ముందుంటున్నారు.

సేవా కార్యక్రమాలు ఇలా..

- కరోనా సమయంలో పేద లకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.
- గుండె సంబంధ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి చికిత్స కోసం రూ.50 వేలు అందించారు.
- నిరుపేద చేనేత కార్మికులు చనిపోతే అనాథలైన ఇద్దరు చిన్నారుల పేరిట రూ.25 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.
- ప్రమాదంలో మృతి చెందిన పాండు కుమార్తెల పేరిట రూ.65,176 డిపాజిట్ చేశారు.
- ఆత్మహత్య చేసుకొన్న శ్రీరాములు కుటుంబానికి రూ.13,615, బియ్యం అందజేశారు.
- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోచంపల్లి ఎస్ఐ మధుసూదన్ జ్ఞాపకార్థం గత వేసవిలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.
- ఊపిరితిత్తుల సమస్యతో జన్మించిన బాలిక చికిత్స నిమిత్తం రూ.37,300 అందజేశారు.
- ఏటా వివేకానంద జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు, 2కె రన్ నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు.
- మట్టి గణపతులను పంపిణీ చేస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు.

'బీటెక్' సర్పంచ్



గ్రామసభలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి



మహేందర్‌రెడ్డి ఎన్నారం సర్పంచ్

రామన్నపేట : రామన్నపేట మండలం ఎన్నారం గ్రామానికి చెందిన మెట్టు మహేందర్‌రెడ్డి 2019 ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సర్పంచ్‌గా ఎన్నికయ్యేనాటికి అతని వయసు 21 సంవత్సరాల పదకొండు రోజులు. అప్పటికి అతను బీటెక్(సివిల్) ఫైనలియర్ చదువుతున్నాడు. సర్పంచ్‌గా ఎన్నికైన మూడునెలలకు ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాడు. తండ్రి శ్రీనివాస్‌రెడ్డి ప్రోత్సాహంతో రాజకీయ అరంగ్రేటం చేసిన మహేందర్‌రెడ్డి సర్పంచ్‌గా గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాడు. ఇంటింటికీ మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఇప్పించారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారు. గ్రామాభివృద్ధికి పాటుపడుతూ సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచే తన పనితీరుతో గ్రామస్తుల ప్రేమానురాగాలు పొందుతున్నాడు.

క్రీడలకు ప్రోత్సాహం



నేతాజీ యువజన మండలి భవనం

ఆత్మకూరు(ఎం) : ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో స్థానిక యువకులు 1981లో నేతాజీ యువజన మండలిని ఏర్పాటు చేసుకున్నారు. 150 మందితో ప్రారంభమైన ఈ మండలి ప్రస్తుతం 400 మంది సభ్యులకు చేరింది. నేతాజీ యువజన మండలి క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తోంది. వివిధ స్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహించింది. ఈ యువజన మండలికి సంబంధించి సుమారు 80 మంది పోలీసులు, ఆర్మీ, వ్యాయామ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలను పొందారు. ఉచిత కుట్టు, కంప్యూటర్ శిక్షణ తదితర సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు చేపడుతోంది. ఇటీవల పోలీసు ఉద్యోగార్థుల కోసం ఉచిత ఈవెంట్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. మండల కేంద్రంలో సుమారు రూ.5 లక్షలతో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్న నేతాజీ యువజన మండలికి ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది.

ఆపదలో మేమున్నామంటూ



మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

హుజూర్‌నగర్ : ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న పలువురు ఒక సొసైటీగా ఏర్పాడి ఆపదలో ఉన్నవారికి మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు. హుజూర్‌నగర్‌కు చెందిన సులువ శ్రీను, మట్టపల్లి రవీందర్, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, జాకీర్ హుస్సేన్, కృష్ణ, లక్ష్మణ్, శ్రీనివాస్, చందు, యువరాజ్, మజీద్, వెంకన్న అంజయ్య కలిసి 2017 అక్టోబర్ 30న ఓపెన్ ఐస్ సొసైటీని ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఈ సొసైటీ 100మంది సభ్యులతో కొనసాగుతోంది.

ఓపెన్ ఐస్ సొసైటీ కార్యక్రమాలు ఇలా..

- పట్టణానికి చెందిన వారి మిత్రుడు బైక్ మెకానిక్ బి వెంకన్న మరణించడంతో సొసైటీ ద్వారా అతని కుటుంబానికి రూ.3.10 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు.
- కరోనాతో చనిపోయిన మరో మిత్రుడు మధు కుటుంబానికి రూ.1 లక్ష అందించారు.
- 75 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు.
- పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేయడమే కాకుండా.. ప్రతిభ చూపినవారికి నగదు పురస్కారాలను అందజేశారు.
- శీతాకాలంలో వృద్ధులకు, పేదవారికి, ఒంటరి మహిళలకు దుప్పట్లు, స్వెటర్లను పంపిణీ చేస్తూ అండగా నిలబడుతున్నారు.

నందికొండ చైర్‌పర్సన్‌గా రాణిస్తున్న అనూషారెడ్డి



కర్న అనూషారెడ్డి, నందికొండ మున్సిపాలిటీ చైర్ పర్సన్

నాగార్జునసాగర్ : పిన్న వయస్సులోనే మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా రాణిస్తున్నారు. కర్న అనూషారెడ్డి నూతనంగా ఏర్పాటైన నందికొండ మున్సిపాలిటీకి తొలి చైర్‌పర్సన్‌గా ఆమె ఎన్నికయ్యారు. 25 ఏళ్ల వయస్సులోనే నందికొండ తొలిపౌరురాలు అయిన అనూష బౌద్ధం పరిఢవిల్లే అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అంతర్గత రోడ్లు, బస్టాండు ఆధునీకరణ, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు, సమీకృత మార్కెట్ నిర్మాణం, వార్డులో 60 ఫీట్ల రోడ్డు సెంట్రల్ లైటింగ్ తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. 60 ఏండ్లుగా నివాసముంటున్న ప్రభుత్వ క్వార్టర్లను వారికే ఇప్పించేందుకు కృషిచేస్తున్నారు. నార్కట్‌పల్లి మండలంలోని కొండపాకగూడెం గ్రామానికి చెందిన అనూష డిగ్రీ బీఎస్సీ పూర్తి చేసింది. పెద్దవూర మండలం తమ్మడపల్లికి చెందిన కర్న శరత్‌రెడ్డిని ప్రేమ వివాహం చేసుకుంది. వివాహమైన నాటి నుంచి నాగార్జునసాగర్‌లోనే నివాసముంటున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 12వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలుపొంది చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. నందికొండ ప్రజలు కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తున్నారు.

ఆదర్శం 'యువ టీం'



కరోనా సమయంలో నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేస్తున్న యువ టీం సభ్యులు

భువనగిరి : సామాజిక సేవా దృక్పథంతో ఏకమైన యువజనులు సంఘంగా ఏర్పడి సేవా కార్యక్రమాలతో ఆపన్నులకు భరోసానిస్తున్నారు. 2009 జనవరిలో భువనగిరికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సూదగాని రాజు 100 మంది యువకులతో యువటీం ఏర్పాటు చేశారు. అప్పటినుంచి విరాళాలు సేకరించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

సేవా కార్యక్రమాలు ఇలా..

- 22 మంది పేద విద్యార్థులకు రూ.2.50 లక్షలు స్కూల్ ఫీజు చెల్లించారు.
- 1000 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు.
- ఐదేళ్లుగా ఇద్దరి పేద విద్యార్థులను దత్తత తీసుకుని రూ.30 వేల చొప్పున స్కాలర్‌షిప్ ఇస్తున్నారు.
- భువనగిరిలో 250 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.
- మూడుసార్లు రక్తదానం శిబిరాలు ఏర్పాటు చేసి సుమారు 400 యూనిట్లు రక్తం సేకరించి రెడ్ క్రాస్‌కు అందజేశారు.
- కరోనా సమయంలో 200 పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, శానిటైజర్లు పంపిణీ చేశారు.
- విద్యార్థులకు ఏటా రూ.6 లక్షల విలువైన నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్నారు.
- పట్టణంలోని బ్రహ్మణవాడ పాఠశాలకు రూ.40 వేలతో మరమ్మతు చేయించారు.
- పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలకు రూ.2 లక్షల విలువ చేసే 58 డెస్క్ బెంచీలను అందజేశారు.

సేవే యువ టీం లక్ష్యం



తమ వంతు బాధ్యతగా సామాజిక సేవా కార్యక్రమాలు చేసేందుకు యువ టీం అనే యువజన సంఘాన్ని ఏర్పాటు చేశా. ఇప్పటి వరకు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాం. ఎవరైనా ఎలాంటి బాధలో ఉన్న మాకు సమాచారం అందితే అవసరాన్ని బట్టి అదుకుంటాం. సేవే లక్ష్యంగా మునుముందు ఇంకా ఎన్నో కార్యక్రమాలు నిర్వస్తాం.
– సూదగాని రాజు, కన్వీనర్

పాలనలో ప్రత్యేకత

- భువనగిరి సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన శాంతికుమారి
- ఐఏఎస్ అధికారిగా మొదటి పోస్టింగ్ భువనగిరిలోనే
- పది నెలల పాలనలో పలు మార్పులు
- డివిజన్‌లో అక్షరాస్యత పెంపునకు కృషి
- సీఎస్‌గా బాధ్యతలు చేపట్టడంపై ఇక్కడి ప్రజల హర్షం



శాంతికుమారి

సాక్షి, యాదాద్రి : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా బాధ్యతలు చేపట్టిన శాంతికుమారి గతంలో భువనగిరి సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. ఐఏఎస్ అధికారిగా ఆమె మొదటగా భువనగిరి సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. 1992 ఆగస్టు 25 నుంచి 1993 జూన్ 14 వరకు భువనగిరి డివిజన్‌లో విధులు నిర్వహించారు. సమస్య ఉన్నచోటుకు వెళ్లి పరిష్కరించే అధికారిగా ఆమెకు ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది. భువనగిరిలో ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుంచి విడిపించారు. ప్రస్తుతం ఆ స్థలాన్ని టీఎన్‌జీవో భవనానికి కేటాయించారు. వలిగొండ మండలంలోని ఎం.తుర్కపల్లి గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూమ స్యను అప్పట్లో క్షేత్ర స్థాయికి వెళ్లి పరిష్కరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు భువనగిరి డివిజన్‌లో పీపుల్స్‌వార్ నక్సలైట్ల ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో.. సబ్ కలెక్టర్‌గా శాంతికుమారి ప్రభుత్వ కార్యక్రమాలను ముమ్మరంగా కొనసాగించారు. ప్రధానంగా చదువు–వెలుగు కార్యక్రమం భువనగిరి డివిజన్‌లో విజయవంతం కావడం కోసం రాత్రి పూట గ్రామాలను తిరిగి నిరక్షరాస్యులైన మహిళలకు చదువు చెప్పించారు. అలాగే యువజన, సేవా, వైద్య బిరాలకు విస్తతంగా హాజరయ్యేవారు. మొత్తంగా సుమారు 10 నెలల కాలంలో శాంతికుమారి సబ్ కలెక్టర్‌గా అందించిన సేవలు భువనగిరిలో ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. ఉత్తమ సేవలు అందించిన అధికారి ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ సీఎస్‌గా నియమితులు కావడం పట్ల యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేఆర్‌ఆర్ విద్యార్థుల ప్రతిభ



యువజనోత్సవాల్లో పాల్గొన్న కళాశాల విద్యార్థులు

కోదాడఅర్బన్ : హైదరాబాద్‌లోని శిల్ప కళావేదికలో యువజనుల సర్వీసుల శాఖ ఈ నెల 9, 10 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో జానపద బృంద గీతాలాపన విభాగంలో కేఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈమేరకు యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులు గాయత్రి, ప్రియాంక, జ్యోతి, సాయి గౌతమి, ఝాన్సీలతో పాటు ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ వేముల వెంకటేశ్వర్లు, డోలక్ వీరయ్యను బుధవారం ప్రిన్సిపాల్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ యువజనోత్సవాల్లో తమ కళాశాల విద్యార్థులు ఐదో స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు.

అపస్మారక స్థితిలో గాయపడిన యువకుడు

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి మండలం గోపాలయపల్లి గ్రామానికి చెందిన మునుకుంట్ల సురేష్ చౌటుప్పల్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నాడు. కాగా ఈ నెల 9వ తేదీన (సోమవారం సాయంత్రం) బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులోకి రాగానే ఓ కారు సురేష్ ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్ తలకు తీవ్ర గాయాలవడంతో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు బాధితుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కాగా అప్పటి నుంచి సురేష్ అపస్మారక స్థితిలో ఉన్నాడు. కాగా, మెరుగైన చికిత్సకు గాను రూ.10లక్షలకు పైగా ఖర్చు అవుతుందని అక్కడి వైద్యులు తెలిపినట్లు సురేష్ బంధువులు తెలిపారు. పేద కుటుంబానికి చెందిన సురేష్ వైద్య ఖర్చులకు డబ్బులు లేని పరిస్థితి. దాతలు ఆర్థికసాయం చేయాలని (ఫోన్‌పే 9010103474) కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

వ్యాసరచనలో ఎంజీయూకి ద్వితీయ బహుమతి

ఎంజీయూ, (నల్లగొండ రూరల్) : జీ– 20 సదస్సుకు మన దేశం నాయకత్వం వహిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు 3 దశల్లో నిర్వహించిన పోటీల్లో మహాత్మాగాంధీ యూనివర్సిటీకి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. రాజ్‌భవన్ వేదికగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలు బుధవారం ముగిసాయి. వ్యాసరచన, వకృత్వం, లోగో తయారీ, మూడు అంశాలు, నాలుగు భాషల్లో జరిగిన ఈ పోటీలకు యూనివర్సిటీ నుంచి 10మంది డిగ్రీ, పీజీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థిని ఆయేషాతబస్సుమ్ ఆంగ్ల విభాగంలో రాష్ట్రస్థాయి రెండో బహుమతి సాధించింది. ఈమేరకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ బహుమతి అందజేశారు. అభినందించారు. ఉత్తమ ప్రతిభను చూపిన విద్యార్థులను వీసీ గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ కృష్ణారావు అభినందించారు.

ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ

మోత్కూరు : బస్సులో ఓ ప్రయాణికుడు పోగొట్టుకున్న పర్సు తిరిగి అప్పగించి ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. ఈ ఘటన మోత్కూరు బస్టాండ్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్–2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో వల్లందాస్ పవన్ కళ్యాణ్ చందుపట్లలో ఎక్కి మోత్కూరులో దిగి పోయారు. కొద్ది సేపటి తర్వాత తన పర్సు పోయిన విషయం గమనించి మోత్కూరు బస్టాండ్‌లో కంట్రోలర్ అనంతుల శ్రీనివాస్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఆయన సదరు బస్సు కండక్టర్‌కు ఫోన్ చేయగా స్పందించిన కండక్టర్ బస్సులో వెతకగా పర్సు దొరికింది. అందులో రూ.8,500 నగదు, ఏటీఎం కార్డులు, ఇతర విలువైన పేపర్లు ఉన్నాయి. పర్సును సదరు యువకుడికి మోత్కూరు ఆర్టీసీ బస్టాండ్‌లో అందించారు. కాగా, హైదరాబాద్–2 ఆర్టీసీ డిపో కండక్టర్ పి.శోభ, డ్రైవర్ యాకాంబరంలతో పాటు కంట్రోలర్ శ్రీనివాస్ గౌడ్‌కు పవన్‌కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపిక

- నల్లగొండ జిల్లా నుంచి మూడు.. భువనగిరి నుంచి ఒకటి



నల్లగొండ జిల్లా సైన్స్ అధికారి లక్ష్మీపతికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి



డిండి : ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థిని సాన్విత, ప్రధానోపాధ్యాయుడు

నల్లగొండ : నిర్మల్ జిల్లాలో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో నల్లగొండ జిల్లా నుంచి మూడు, భువనగిరి నుంచి ఒక ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు నిర్వాహకులను రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సన్మానించి, బహుమతులు అందజేశారు. నల్లగొండ జిల్లా నుంచి 3 ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికైనందుకు ఆ జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతిని మంత్రి సన్మానించారు. ఈమేరకు సైన్స్ అధికారి వనం లక్ష్మీపతితో పాటు గైడ్ టీచర్లకు నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లం భిక్షపతి అభినందనలు తెలిపారు.

పాము కాటు నుంచి రైతులను రక్షించే పరికరం

కనగల్ మండలం జి చిన్నారం గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి చింతల నవీన్ పాము కాటు నుంచి రైతులను రక్షించే పరికరం (హ్యాండ్‌స్టిక్ వి ప్రొటెక్టింగ్ ఫార్మర్స్ ఫ్రమ్ స్నేక్ బైట్) ప్రాజెక్టును రూపొందించాడు. దీనికి గైడ్ టీచర్ వినోద్ కుమార్.

టీచర్ లెర్నింగ్ మెటీరియల్

బీఈడీ విభాగంలో నల్లగొండలోని చర్లపల్లిలో గల డీపీఎం కళాశాలకు చెందిన అస్మిన్ కౌసర్ రాజేశ్వరి, గైడ్ టీచర్ బొడ్డుపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో టీచర్ లెర్నింగ్ మెటీరియల్ ప్రాజెక్టును ప్రదర్శించారు.

కూలింగ్ సీలింగ్ ఫ్యాన్ ప్రాజెక్టు

డిండి : డిండి మండల పరిధిలోని కందుకూరు గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని సాన్విత, గైడ్ టీచర్ శ్రీనివాస్‌లు కూలింగ్ సీలింగ్ ఫ్యాన్ ప్రాజెక్టు రూపొందించారు.

ప్రాజెక్టు నిర్మాణం

సీలింగ్ ఫ్యాన్ పైభాగాన ట్రీగార్డ్‌తో తయారు చేసిన ఫ్రేమ్ ఉంచాలి. దీనిపైన రెండు స్పాంజ్‌లతోపాటు వాటి మధ్యన ఇన్‌కమింగ్ వాటర్ కనెక్షన్ కలిగిన రెండు డ్రిప్ పైపులు అమర్చాలి. అదే విధంగా స్పాంజ్‌లు తడిసిన తర్వాత వచ్చే వేస్టేజ్ వాటర్ కిందకు వెళ్లడానికి మరోపైపు అమర్చాలి. నీటి కనెక్షన్ సప్లయ్ ఇవ్వడంతో స్పాంజ్‌లు తడిసిన తర్వాత సీలింగ్ ఫ్యాన్ స్విచ్ ద్వారా ఆన్ చేయాలి. దీంతో సీలింగ్ ఫ్యాన్ ఉన్న గది అంతా చల్లగా మారుతోంది.

ఇటుకలు లెక్కించే ప్రాజెక్ట్

భువనగిరి : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎగ్జిబిట్ జాతీయస్థాయికి ఎంపికైంది. నిర్మల్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలో భువనగిరి విద్యార్థి ప్రదర్శించిన ఎగ్జిబిట్ ఉంది. 7వ తరగతి చదువుతున్న మాటూరి విఘ్నేష్ ఇటుకలు లెక్కించే ప్రాజెక్ట్ రూపొందించాడు. ఈ పరికరంతో తప్పులు లేకుండా, సమయం వృథా కాకుండా లెక్కించవచ్చని నిరూపించాడు. విద్యార్థి అతనికి గైడ్‌గా ఉన్న ఉపాధ్యాయుడు భీమిశెట్టి శ్రీనివాస్, విశాఖ వేణుధర్‌రెడ్డిని కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఈఓ అభినందించారు.



ప్రాజెక్టుతో విద్యార్థి విఘ్నేష్

నడిగూడెం విద్యార్థినికి ద్వితీయ బహుమతి



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని ధరణి

నడిగూడెం : నిర్మల్ జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో జూనియర్స్ గణితం విభాగంలో వలయాకారం ఉన్న ద్విమితీయ ఆకారాలను త్రిమితీయ ఆకారంలోకి మార్చడం అనే అంశం నడిగూడెంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి ధరణి ద్వితీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి విద్యార్థిని ధరణి, గైడ్‌లు శైలజ, చైతన్యలకు బహుమతి అందజేశారు. వీరిని డీఈఓ సలీం షరీఫ్, ప్రధానోపాధ్యాయురాలు కనకతార అభినందించారు.

మిరప రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త లవకుమార్

పెన్‌పహాడ్ : మిరప రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేవీకే శాస్త్రవేత్తలు లవకుమార్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని గాజులమల్కాపురంలో పలువురు రైతుల మిరప పంటలను పరిశీలించి మాట్లాడారు. సమగ్ర యాజమాన్య పద్ధతుల్లో భాగంగా రైతులు పంటల్లో ఎకరానికి 50 నుంచి 100చొప్పున నీలి, తెలుపు రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలని సూచించారు. వేపనూనె 5మి.గ్రాముల లీటర్ నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. తల్లి పురుగులు గుడ్లు పెట్టకుండా వేపనూనె నివారిస్తుందన్నారు. కార్యక్రమంలో కేవీకే ఉద్యానవన శాఖ అధికారి సీహెచ్ నరేష్, సస్యరక్షణ శాస్త్రవేత్త డి.ఆదర్శ్, మృత్తిక శాస్త్రవేత్త కిరణ్, సూర్యాపేట డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి కన్నా జగన్‌గౌడ్, రైతులు సీతారాంరెడ్డి, సంజీవరెడ్డి, అంజయ్య, వెంకట్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.